








పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఏదుల వద్ద నిర్మాణంలో ఉన్న పనులు(ఫైల్)



ఈసారీ..

- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల ప్రస్తావన కరువు
- ఊసేలేని బెంగళూరు- హైదరాబాద్ మధ్య పారిశ్రామిక కారిడార్
- ఎలివేటెడ్ కారిడార్, జాతీయ రహదారి 44 విస్తరణకు నిధులేవీ?
- ఎస్‌హెచ్‌జీల్లో మహిళలకు, వర్తకులకు క్రెడిట్ కార్డులతో ఉపయోగం
- ఉద్యోగులకు ఊరటనిచ్చేలా.. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు
- నవోదయ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు ఈసారి కూడా లేనట్లే..

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్న కేంద్ర బడ్జెట్ ఈసారి కూడా ఉసూరుమనిపించింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రత్యేక హోదా లేదా నిధుల కేటాయింపు ప్రస్తావన లేకుండా పోయింది. అలాగే కీలకంగా భావించిన కేంద్రీయ విద్యాలయాలు, కొత్త జిల్లాల్లో నవోదయ పాఠశాలలు, నారాయణపేట జిల్లాలో సైనిక్ స్కూల్ ప్రస్తావన కూడా లేదనేది సుస్పష్టమవుతోంది. ఇక దేశంలోనే అతిపెద్ద జాతీయ రహదారి అయిన ఎన్‌హెచ్ 44ను విస్తరించాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. దీనిపై ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతుండటం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు 12 లేన్లుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు పెట్టాలని గతంలో ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కేంద్రానికి కూడా ఈ మేరకు ప్రతిపాదనలు పంపినప్పటికీ.. ఈ బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపుపై ప్రత్యేక ప్రస్తావన లేదు. ఇక నల్లమల అభయారణ్యం మీదుగా శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి డీపీఆర్ ఇప్పటికే రెడీ అయ్యింది. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని ఆశించినప్పటికీ.. నిరాశే ఎదురైంది. అయితే కొన్ని వేతన, మధ్య తరగతి జీవులకు ఊరట కలిగించే అంశాలు బడ్జెట్‌లో ఉండటం కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు. రైల్వేలకు కేటాయింపులు ఏ మేరకు దక్కాయనే విషయం మరో రెండు రోజులు ఆగితే కానీ తెలిసే అవకాశం లేదు. ఇప్పటికే ఇక్కడ రెండు రైల్వేలైన్లు ఎఫ్ఎల్ఎస్ పూర్తి చేసుకుని రెడీగా ఉండగా.. వాటికైనా మోక్షం కలుగుతుందా? లేదా అనేది వేచి చూడాలి.



ఎస్‌హెచ్‌జీలకు క్రెడిట్ కార్డులు..

పట్టణ పేదలు, మహిళా సంఘాల సభ్యులు, వీధి వ్యాపారులు, వర్తకులకు రూ.30 వేల పరిమితితో క్రెడిట్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు

(మిగతా 8లో..)

పాలమూరులో ఊర్వశి రౌతేలా సందడి

- సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన సినీనటి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

రిబ్బన్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

ఫొటోకు ఫోజిచ్చిన ఊర్వశి రౌతేలా



పాలమూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పట్టణంలో సినీ నటి ఊర్వశి రౌతేలా శనివారం సందడి చేశారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్ 39వ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో ఊర్వశి రౌతేలా, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేయగా, ఊర్వశి రౌతేలా జ్యోతి ప్రజ్వలన చేశారు. సంస్థ డైరెక్టర్లు సురేశ్‌సీర్ల, అభినయ్, రాకేశ్, కేశవ్ వారికి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో పాలమూరు ప్రజలకు తక్కువ ధరల్లో నాణ్యమైన వస్త్రాలను అందించే షాపింగ్ మాల్ ఇక్కడ ఏర్పాటు చేయడం శుభ పరిణామమని చెప్పారు. నటి ఊర్వశి రౌతేలా మాట్లాడుతూ సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ అంకిత భావానికి, ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. జిల్లా ప్రజలు కోరుకునే నాణ్యత, నవ్యత, అభిరుచికి తగ్గట్లుగా చీరలు, దుస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో అద్భుతంగా కనిపించేందుకు అత్యుత్తమ కలెక్షన్స్ సిద్ధం చేసినట్లు తెలిపారు. పెళ్లి కుమార్తెల కోసం మగ్గాలపై నేసిన చీరలు ప్రత్యేకమని, పెళ్లి కుమారుల కోసం ఎత్నిక్‌వేర్ గురించి ఎంతచెప్పినా తక్కువేనని అన్నారు. అన్ని వర్గాల వారిని అలరించేలా, సరసమైన ధరలకు దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా కాస్ట్ టు కాస్ట్ అమ్మకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్ రాంలక్ష్మణ్‌లు పాల్గొన్నారు.


సినీ నటిని చూడటానికి తరలొచ్చిన అభిమానులు


చిన్నారులు పడిపోయిన జడ్చర్ల మండలం ఉదండాపూర్ ప్రాజెక్టులోని నీళ్లు నిలిచిన గుంత

అమ్మవారి వార్షికోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం 8

మార్మోగిన హనుమాన్ నామస్మరణ
- ముగిసిన అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు
8

నిండుకుండలా ఆర్డీఎస్
- 292 మీటర్ల మేర నీరు: ఏఈ శ్రీనివాసులు
8

తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడితే చర్యలు
- నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్
- రెండు మొబైల్స్ సీజ్ చేసిన అధికారి
8

నీటి గుంతలో పడి చిన్నారి మృతి

- మరో చిన్నారి గల్లంతు
- ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ఘటన


గల్లంతైన మహేశ్, మృతి చెందిన భాగ్యలక్ష్మి (ఫైల్)

జడ్చర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్ సమీపంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా తీసిన గుంతలో నిలిచిన నీటిలో పడి ఓ చిన్నారి మృతి చెందింది. మరో చిన్నారి గల్లంతైన సంఘటన శనివారం చోటుచేసుకున్నది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ఉదండాపూర్ గ్రామానికి చెందిన ఆరేళ్ల మల్లయ్య, పార్వతమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. 5వ తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె పాఠశాలకు వెళ్లడంతో చిన్న కుమార్తె భాగ్యలక్ష్మి(6), కుమారుడు మహేశ్(4)లతో గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలానికి పార్వతమ్మ వెళ్లింది. పొలం వద్ద ఉన్న చెట్టు నీడన చిన్నారులను కూర్చోపెట్టి పొలంలోకి వెళ్లింది. ఆ చిన్నారులు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఆ పక్కనే ఉన్న నీటిగుంతలో పడిపోయారు. గుర్తించిన తల్లి వారికోసం నీటిగుంతలో గాలించగా భాగ్యలక్ష్మి మృతదేహం లభించింది. సంఘటనా స్థలానికి జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ఫైర్‌ఇంజన్ సిబ్బంది చేరుకొని మహేశ్ కోసం గాలింపు చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తీసిన గుంతల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఇప్పటికే పలు పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, చర్యలు తీసుకోని కారణంగా ఈ సంఘటన చోటుచేసుకున్నదని గ్రామస్థులు ఆరోపించారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఎన్నికల పర్యవేక్షణకు 12 మంది అధికారుల నియామకం


ఈవీఎం గోదాం వద్ద కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన నోడల్ అధికారులతో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వెలువడినా సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికలకు 12 మంది పర్యవేక్షకులను నియమిస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో గోవిందరాజులుకు మ్యాన్ పవర్ పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. డీఆర్‌డీవో మొగులప్పకు బ్యాలెట్ బ్యాక్స్, డీటీవోకు రవాణా, పీఆర్ డీఈ జ్యోతికి శిక్షణ, డీఏవో జాన్‌సుధాకర్‌కు సామగ్రి, జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మీకి ఎంసీఎంసీ, ఆంజనేయులుకు ఎక్స్‌పెండిచర్ అకౌంట్స్, డీసీవో సుదర్శన్‌కు పరిశీలకులు, అంజయ్యకు బ్యాలెట్ పేపర్, డీపీఆర్‌వో రషీద్‌కు మీడియా, యోగానంద్‌కు హెల్ప్‌లైన్ గ్రీవెన్స్, డీపీవో కృష్ణకు రిపోర్ట్స్ రిటన్స్ పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. అంతకు ముందు బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాంను పరిశీలించారు.

పీయూ అధ్యాపకుడికి పేటెంట్ హక్కులు

- స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్ పరికరానికి..
- స్టాక్ మార్కెట్ ట్రెండ్స్ విశ్లేషించడానికి ఉపయోగం

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ, ఎంబీఏ విభాగంలో అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ అర్జున్ కుమార్ రూపొందించిన స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్ అనే పరికరానికి పేటెంట్ హక్కు లభించింది. ఈ సందర్భంగా పీజీ కళాశాలలో డాక్టర్ చంద్రకిరణ్ ఆయనను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పరికరం రూపకల్పన బృందంలో ఆరుగురు సభ్యులున్నారని, వారిలో అర్జున్‌కుమార్ కీలకమని తెలిపారు. ఇది ఏఐ ఆధారిత పరికరమని, స్టాక్ మార్కెట్ ట్రెండ్‌లను విశ్లేషించడానికి, అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఆర్థిక వార్తలు, మార్కెట్ డేటా, సోషల్ మీడియా సహా విశేషిస్తుందని చెప్పారు. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్, సహజ భాషా ప్రాసెసింగ్‌తో పనిచేస్తుందని తెలిపారు. డాక్టర్ అర్జున్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు, స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై అంచనాలను, సిఫార్సులను అందిస్తుందని తెలిపారు. వివిధ మార్కెట్, ఆర్థిక సూచికలను విశ్లేషిస్తుందని అన్నారు.


డాక్టర్ అర్జున్ కుమార్‌ను అభినందిస్తున్న పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, అధ్యాపకులు

నిఘానీడలో.. ఇంటర్ ప్రాక్టికల్స్

- మాస్ కాపీయింగ్‌కు చెక్
- రేపటి నుంచి 22 వరకు పరీక్షలు



వనపర్తిరూరల్/నాగర్‌కర్నూల్ టౌన్/మహబూబ్‌నగర్ విద్యావిభాగం/గద్వాల, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు చెక్ పెట్టేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిఘా నీడలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షల్లో మార్కులు అధికంగా వస్తున్నాయనే ఆరోపణలకు చెక్ పెట్టేందుకు పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటిని ఇంటర్ ఎగ్జామ్ బోర్డు హైదరాబాద్‌కు అనుసంధానం చేస్తారని అధికారుల ద్వారా తెలిసింది. పరీక్షలు నిర్వహించే తీరును అక్కడి నుంచి పర్యవేక్షించనున్నారు. ఏమైనా అక్రమాలు జరిగినట్లు వారి దృష్టిలో సంబంధిత కళాశాల యజమానులపై చర్యలు తీసుకోనున్నారు. సోమవారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి 22 వరకు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో నాలుగు విడతల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు. మొదటి విడత 3వ తేదీ నుంచి ఏడో తేదీ వరకు, రెండో విడత 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు, మూడో విడత 13 నుంచి 17 వరకు, నాలుగో విడత 18 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. వనపర్తి జిల్లావ్యాప్తంగా 41 పరీక్షా కేంద్రాలను ఏర్పా టు చేశారు. మొత్తం జనరల్ 4,104 (ద్వితీయ సంవ త్సరం) మంది, ఒకేషనల్ 2,487 (ప్రథమ, ద్వితీయ సంవత్సరం) మంది విద్యార్థులు పరీక్షలకు


సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వనపర్తిలోని ఓ పరీక్ష కేంద్రం

(మిగతా 8లో..)

స్పోర్ట్స్ బాక్స్

దేశానికి ప్రాతినిధ్యం వహించాలి

» మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కరాటే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాస్టర్లు, నాయకులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యార్థులు ఒలింపిక్ క్రీడల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. విశాఖపట్టణంలో ఈ నెల ఆరు నుంచి తొమ్మిదవ తేదీ వరకు అంతర్జాతీయ కరాటే పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు వెళ్తున్న కింగ్‌షోటోకాన్ డూ ఇండియా విద్యార్థులను శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి విజేతలుగా నిలువాలన్నారు. ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. క్రీడాకారులకు మహబూబ్‌నగర్ విద్యానిధి నుంచి రూ.25 వేలు ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ పోటీల్లో సాయిప్రణీత్, హుజేఫా, మారియాబేగం, సాబేర్‌పాషా, హుమేరబేగం, హఫన్నబేగం, నిఖిల్, సూఫియాన్‌అలీ పాల్గొననున్నట్లు కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీపాషా ఖాద్రీ తెలిపారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, డీఈఐవో కౌసర్‌జహాన్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కింగ్‌షోటోకాన్ ప్యాట్రన్ లక్ష్మణ్, జహంగీర్ పాషా ఖాద్రీ, వైస్ చైర్మన్ చెన్నవీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫిక్‌పటేల్, కోశాధికారి తిరుతపయ్య, నాయకులు జకీ, సాదుల్లా, ఫయాజ్, నాజియ, అంజనేయులు, షోయెబ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టోర్నీకి రిషి విద్యార్థులు



రగ్బీ రాష్ట్ర స్థాయి టోర్నీకి ఎంపికైన విద్యార్థులు శ్రీనివాస్, చరణ్‌లతో ప్రిన్సిపాల్ వెంకటరమణ, డైరెక్టర్ పూజిత

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రగ్బీ రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టుకు న్యూరిషీ విద్యార్థులు శ్రీనివాస్, చరణ్ ఎంపికయ్యారు. ఆదిలాబాద్ జిల్లా, మంచిర్యాలలో ఆదివారం నుంచి నిర్వహించనున్న టోర్నమెంట్‌లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల చైర్‌పర్సన్ చంద్రకళ వెంకటయ్య, డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, శిరీష, ప్రవీణ్ కుమార్, సాయి సుశాంత్ కృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటరమణ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు తాము అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ విష్ణుకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ సారీ..

కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల ప్రస్తావన కరువు

(7వ పేజీ తరువాయి)

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ప్రకటించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 41,684 స్వయం సహాయక సంఘాలు ఉండగా.. ఇందులో 4.27 లక్షల మంది సభ్యులు ఉన్నారు. అందరూ బీపీఎల్ వర్గాలకు చెందిన వారే. ఏదైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు ఈ క్రెడిట్ కార్డులను ఉపయోగించుకుని మహిళలు రూ.30 వేల వరకు ఖర్చు చేసుకుని, తిరిగి ఒకేసారి లేదా నెలవారీ వాయిదాలుగా చెల్లించుకునే వెసులుబాటు లభించనుంది. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన చాలామంది ప్రజలు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో గిగ్ వర్కర్లుగా పని చేస్తున్నారు. ప్రముఖ డెలివరీ సంస్థలైన స్విగ్గి, జొమాటో, అమేజాన్, ఫ్లిప్‌కార్ట్, ఇతర డెలవరీ సంస్థల్లో పనిచేస్తుండగా, ఇప్పటివరకు వీరి భద్రకు ఎలాంటి చట్టాలు లేవు. అయితే ఈ గిగ్ వర్కర్లకు శ్రమ్ పోర్టల్ ద్వారా గుర్తింపు కార్డులు పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వ గుర్తింపు లభిస్తుంది. అలాగే ఆరోగ్య బీమా కూడా అందజేయాలని బడ్జెట్‌లో ప్రస్తావించడం శుభపరిణామంగా చెప్పవచ్చు. పీఎం ఆవాస్ యోజన కింద నిధులు కేటాయించడం కూడా తెలంగాణకు కలిసి వచ్చే అవకాశం ఉంది. సొంతగా ఇళ్లు నిర్మించుకుని బ్యాంకుల్లో రుణాలు పొందే వారికి రూ. 2.65 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కూడా ఈ స్కీం నిధులు ఉపయోగపడే అవకాశం ఉంది.

వేతన జీవులకు ఊరట..

కేంద్ర ప్రభుత్వం పన్ను విధానం, వస్తువులపై జీఎస్టీ స్లాబులతో కొద్దికాలంగా పేద, మధ్య తరగతి, మరీ ముఖ్యంగా వేతన జీవుల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. తమ నుంచి ఎక్కువగా పన్ను దోపిడీ జరుగుతోందని, ట్యాక్స్ టెర్రరిజానికి కేంద్రం పాల్పడుతుందంటూ పలువురు ఆరోపించారు. సోషల్ మీడియాలో పాప్‌కార్న్ ట్యాక్స్‌పై పెద్ద ఎత్తున చర్చ కూడా జరిగింది. అయితే ప్రతీసారి తమకు ఊరట దక్కుతుందని వేతన జీవులు ఆశపడి.. బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావన చూసి ఉసూరుమంటున్న పరిస్థితి ఉండేది. అయితే గత బడ్జెట్‌తో పోల్చితే వేతన జీవులకు కొంత మేర ఊరట లభించిందని చెప్పొచ్చు. వ్యక్తిగత ఆదాయం రూ.12 లక్షలలోపు ఉంటే వారికి పూర్తి ఆదాయపన్ను మినహాయింపును ప్రకటించింది. స్టాండర్డ్ డిడక్షన్‌తో కలుపుకుంటే అది రూ.12.75 లక్షలుగా ఉంటుంది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలకు దాదాపు ఏడాదికి రూ.70 వేల వరకు ఊరట లభించనుంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 వేల మంది వరకు ఉద్యోగులకు దీనివల్ల లబ్ధి చేకూరే అవకాశం ఉంది. అదే సమయంలో ఉద్యోగులు చాలా కాలంగా సీపీఎస్ రద్దు కోసం పోరాడుతున్నారు. ఈ సీపీఎస్ స్కీం వల్ల షేర్ మార్కెట్‌లో పెట్టుబడుల వల్ల నష్టాలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈసారి కూడా సీపీఎస్‌పై ఎలాంటి ప్రకటన చేయలేదు. అలాగే ప్రతీ జిల్లా కేంద్రం ఆస్పత్రిలో డే కేర్ క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా.. ఇప్పటికే ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లాల్లో జీజీహెచ్‌లు ఉన్నందున కచ్చితంగా ఈ సెంటర్‌లు ఉంటాయి. అయితే చాలాచోట్ల ఈ డే కేర్ క్యాన్సర్ సెంటర్లలో సేవలు అందడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. దీన్ని స్ట్రీమ్‌లైన్ చేయాల్సి ఉంటుంది.

బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు దక్కింది ఏమీ లేదు. రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు. ప్రత్యేక నిధులు తెస్తామని గొప్పలు చెప్పే ఎంపీలు, బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగితే నోరు మెదపడంలేదు. బడ్జెట్ కేవలం అంకెల గారడీ తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు.

- జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

పేద, మధ్య తరగతులపై భారం



కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి కుటుంబాలపై భారం వేసింది. బడ్జెట్ పేదల పక్షాన లేదు. వారికి ఇబ్బందులు కల్గించేలా ఉంది. ప్రతీ ఏడాది లాగానే ఈ సంవత్సరం కూడా నిరుత్సాహం కలిగించింది. కేటాయింపుల్లో రాష్ట్రంపై వివక్ష చూపించడం విడ్డూరంగా ఉంది. ఇలాంటి బడ్జెట్ వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగమూ లేదు.

- బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

మధ్య తరగతి, ఉద్యోగులకు ఊరట



మధ్య తరగతి, ఉద్యోగులకు రూ.12 లక్షల ఆదాయం వరకు పన్ను లేకపోవడం వల్ల కొంత ఊరట కలిగించింది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు రుణపరిమితిని పెంచడం వల్ల రైతులకు మేలు కలుగుతుంది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రం పేరు కూడా లేకపోవడం ప్రజలను నిరాశకు గురిచేసింది.

- పరశురాం, ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడు, కోస్గి జూనియర్ కళాశాల

నిధులు రాబట్టడంలో రేవంత్ సర్కార్ విఫలం



కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో రేవంత్ సర్కార్ విఫలమైంది. ఏడాదిలో 30 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం ఏం సాధించారో ప్రజలకు చెప్పాలి. ఇద్దరు కేంద్ర మంత్రులు సహా ఎనిమిది మంది ఎంపీలు ఉండి ఏం సాధించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం కుదేలయ్యింది. ఎరువులపై సబ్సిడీని తగ్గించడం రైతులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

- నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి, వనపర్తి

తెలంగాణపై చిన్నచూపు



తెలంగాణపై కేంద్రం చిన్న చూపు చూసింది. ఢిల్లీ, బిహార్ రాష్ట్రాలపైనే ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలున్నా ఉపయోగం సున్నా. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనపై మాట్లాడిన కిషన్ రెడ్డి, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏ పార్టీ ప్రాముఖ్యత ఇచ్చిందో చెప్పాలి. వ్యవసాయ, ఆహార సబ్సిడీలు తగ్గించి వ్యవసాయ రంగంపై తమకు చిత్తశుద్ధి లేదని నిరూపించుకున్నది.

- మేఘారెడ్డి, ఎమ్మెల్యే, వనపర్తి


పాలమూరు జిల్లాకు మళ్లీ మోసం



కేంద్ర ప్రభుత్వం పాలమూరు జిల్లాను మళ్లీ మోసం చేసింది. బడ్జెట్ కేటాయింపుల్లో ఉమ్మడి జిల్లాకు ఒరిగింది శూన్యం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందన్న కుట్రతో కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపింది. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నా, జిల్లా ఎంపీ డీకే అరుణ, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నారు.?

- జి.మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

పేదలు, మధ్య తరగతికి లక్ష్మీ కటాక్షం



పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలు, మధ్య తరగతికి లక్ష్మీ కటాక్షం. ఉద్యోగులు, ప్రజలకు ఈ బడ్జెట్ ద్వారా పెద్ద ఊరట లభించింది. ఆదాయపు పన్ను విషయంలో స్లాబ్ రేట్లను తగ్గిస్తూ 12లక్షల వరకు నో టాక్స్ రిలీఫ్ అందించడం శుభపరిణామం. అని తెలిపారు. ఇది భారత అభివృద్ధికి విజన్‌తో కూడుకున్న బడ్జెట్.

- నాగురావు నామాజీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు

ఉద్యోగులకు అనుకూలం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26కు సంబంధించిన 50.65 లక్షల కోట్ల ఆర్థిక బడ్జెట్ ఉద్యోగస్తులతో పాటు మధ్యతరగతి, వ్యవసాయ అనుబంధ సంస్థలకు అనుకూలంగా ఉంది. కొత్త ఆదాయం పన్ను విధానంలో రూ. 12.75 లక్షల పన్ను లేకపోవడం ఉద్యోగులకు ఉపశమనం కలిగిస్తోంది. విద్య, ఆరోగ్యానికి కూడా బడ్జెట్ ఉపయోగపడేలా ఉంది.

- కృష్ణ, ప్రిన్సిపాల్, ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు, గద్వాల

పరిశోధనలకు పెద్ద పీట



ఆదాయ పరిమితి పెంపుపై వేతన జీవులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్ఎస్ఎమ్ఈ ద్వారా ఉపాధి కల్పనకు, పీయం రీసర్చ్ ఫెలోషిప్ ద్వారా పరిశోధనలకు ఇరవై వేల కోట్ల రూపాయలు కేటాయించి పెద్దపీట వేశారు. గత సంవత్సరంతో పోలిస్తే నాలుగు శాతం రాబడి ఆదాయంలో వృద్ధి రేటును సాధించాం. గ్రామీణాభివృద్ధికి, ఆరోగ్య రంగానికి సముచిత ప్రాధాన్యం కల్పించారు.

- డాక్టర్ మద్దెని వెంకటేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీయూ

రక్షణ రంగానికి అధిక ప్రాధాన్యం



కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగానికి అధిక ప్రాధాన్యం లభించింది. గ్రామీణ వైద్యం, విద్యా రంగాలకు కేటాయింపులు స్వల్పంగా పెరిగాయి. మొట్టమొదటి సారి ఐదు లక్షల మంది మహిళలకు, ఎస్సీ, ఎస్టీ వ్యవస్థాపక పెట్టుబడిదారులకు రెండు కోట్ల రూపాయలు ఇవ్వడం వల్ల ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. మెడికల్ సీట్లు, జాతీయ విద్యా సంస్థలలో సీట్ల పెంపుతో విద్యార్థులకు ప్రయోజనం.

- డాక్టర్ బీవీ రాఘవేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీయూ

అమ్మవారి వార్షికోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం పలుకుతున్న సంపత్ కుమార్

అలంపూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3వ తేదీన వసంత పంచమి జోగుళాంబ అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, పాలక మండలి సభ్యులతో కలిసి శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివాసంలో ఆహ్వాన కరపత్రాన్ని అందించి వార్షికోత్సవాలకు రావాలని కోరారు. ఈవో పురేందర్ కుమార్, ఉప ప్రధాన అర్చకుడు, ఎక్స్ అఫిసియో సభ్యుడు డీ ఆనంద్ శర్మ, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడితే చర్యలు

- జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్

- రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేసిన డీఈవో



గగ్గలపల్లి ప్రాథమిక పాఠశాలలో హాజరు రిజిస్టరును పరిశీలిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల తరగతి గదిలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌లను ఉపయోగిస్తే చర్యలు తప్పవని డీఈవో రమేష్ కుమార్ ఉపాధ్యాయులను హెచ్చరించారు. శనివారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని గగ్గలపల్లి ప్రాథమిక పాఠశాలను డీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదిలో విద్యాబోధన చేయకుండా సెల్‌ఫోన్ ఉపయోగిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను డీఈవో గుర్తించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ తరగతి గదిలో సెల్‌ఫోన్లు ఉపయోగిస్తూ విద్యాబోధనపై ప్రభావం పడుతుందన్న అంశంపై రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు గతంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని ఉపాధ్యాయులకు డీఈవో గుర్తు చేశారు. జిల్లాలో ఇకనుంచి ఏ పాఠశాలలోనైనా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు ఉపయోగించడం నిషేధమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు వారి సెల్‌ఫోన్లను నిత్యం ప్రధానోపాధ్యాయుడి కార్యాలయంలోనే ఉంచాలని, పాఠశాల అంశాలకు సంబంధించి సెల్‌ఫోన్ వినియోగించాల్సి వస్తే అది కేవలం ప్రధానోపాధ్యాయుడి గదిలోనే వినియోగించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించి తరగతి గదిలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లొదని డీఈవో కోరారు. ఆయన వెంట మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి, డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ నాగేందర్ పాల్గొన్నారు.

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

» మాస్ కాపీయింగ్‌కు చెక్

» రేపటి నుంచి 22 వరకు పరీక్షలు

(7వ పేజీ తరువాయి..)

హాజరు కానున్నారు. జనరల్ విభాగంలో ఎంపీసీ విద్యార్థులు 2,234 మంది, బైపీసీ విద్యార్థులు 1,870 మంది ఉన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 43 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్ 38, ఒకేషనల్ 5 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్ విద్యార్థులు 2,882 మంది(ద్వితీయ సంవత్సరం), ఒకేషనల్ విద్యార్థులు - 1,412 మంది (ప్రథమ మరియు ద్వితీయ సంత్సరం) హాజరు కానున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో జనరల్ 36, ఒకేషనల్ 13 కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 12,109 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జనరల్ 8,392 మంది (ద్వితీయ సంవత్సరం), ఒకేషనల్ 3,717 మంది (ప్రథమ, ద్వితీయ) విద్యార్థులు హాజరుకానున్నారు.



ప్రాక్టికల్స్ పరీక్షలకు సంబంధించి ల్యాబ్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

జోగుళాంబ గద్వాల జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,643 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

ఆన్‌లైన్‌లో ప్రశ్న పత్రాలు

ప్రాక్టికల్స్‌కు సంబంధించిన ప్రశ్న పత్రాలు ఇంటర్ బోర్డు ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నది. అరగంట ముందుగా సంబంధిత శాఖలకు ఓటీపీ వస్తుంది. ఆ ప్రకారం ప్రశ్న పత్రాన్ని డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. పరీక్ష నిర్వహణ కోసం డీఈసీని ఏర్పాటు చేశారు. కన్వినర్‌గా డీఐవో అంజయ్య, సభ్యులుగా ఇద్దరు ప్రిన్సిపాళ్లు, ఒక అధ్యాపకుడిని నియమించారు.

విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దు



విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ప్రాక్టికల్స్ చేయాలి. ఒత్తిడికి గురి కావొద్దు. ప్రైవేటు కళాశాలల యజమాన్యాలు కళాశాల ఫీజు చెల్లించలేదని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు. ప్రతీ విద్యార్థి ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే విధంగా చూడాలి. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు. ప్రతీ ప్రభుత్వ కళాశాలకు సీసీ కెమెరాల సామాగ్రి పంపిణీ చేశాం.

- డీఐఈవో ఎర్రం అంజయ్య

ప్రత్యేక పాలనకు ఏడాది

» నిధుల కొరతతో ఇబ్బందులు » గ్రామ పంచాయతీల్లో పరిష్కారం కాని సమస్యలు

అచ్చంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనకు నేటితో ఏడాది పూర్తి అయ్యింది. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఎస్ఎఫ్‌సీ నిధులు కూడా అరకొరగానే మంజూరయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాల్లో 464 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం 146 గ్రామ పంచాయతీలకు మాత్రమే ప్రత్యేక అధికారులున్నారు. మిగతా గ్రామాలకు వారే ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. బీసీ రిజర్వేషన్లు తేలాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగనున్నది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీలు నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. కనీసం పారిశుద్య కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. పన్నుల వసూలు కూడా అంతంత మాత్రంగానే ఉంది. దీంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వీధి లైట్లు మార్చే పరిస్థితి కూడా లేదని ప్రజలు వాపోతున్నారు. అయితే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న కొందరు ఆశావహులు సొంత డబ్బుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. చిన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు.



లింగాల బస్టాండ్ సమీపంలో పేరుకుపోయిన చెత్త

త్వరగా ఎన్నికలు నిర్వహించాలి



గ్రామ పంచాయతీ ఎన్నికలను త్వరగా నిర్వహించాలి. ప్రత్యేక అధికారులు గ్రామాలకు సరిగా రావడం లేదు. నిధుల కొరతతో అభివృద్ధి కుంటుపడింది. ప్రభుత్వం స్పందించి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేయాలి.

- నాగరాజు, వార్డు మాజీ సభ్యుడు, పెనిమిళ్ల

నిధుల కొరతతో ఇబ్బంది



లింగాల గ్రామపంచాయితీ ప్రత్యేకాధికారిగా గత ఏడాది నవంబర్ 11 నుంచి బాధ్యతలు స్వీకరించాను. నిధుల కొరతో ఇబ్బంది ఎదురవుతోంది. ఏవోగా విధులు నిర్వర్తిస్తూనే, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాను.

- అనిల్, ఏవో, లింగాల గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి

మార్మోగిన హనుమాన్ నామస్మరణ

» ముగిసిన అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

» చివరి రోజు పోటెత్తిన భక్తులు



స్వామి వారికి చక్రతీర్థ స్నానం చేయిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

ఊర్కొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ఈ సందర్భంగా జైశ్రీరాం, జై హను మాన్ నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. ఉదయం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చక్రతీర్థ స్నానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని హారతులు, మంగళవాయిద్యాల నడుమ దివంగత అర్చకుడు చిరివెళ్లి కృష్ణమూర్తిశర్మ నివాసానికి చేర్చారు. దీంతో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కల్వకుర్తి సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, అర్చకు లు దత్తాత్రేయశర్మ, మహేశ్‌శర్మ, శ్రీనివాసశర్మ, ప్రవీణ్‌శర్మ, కార్యనిర్వ హణాధికారి సత్యచంద్రారెడ్డి, సిబ్బంది మారుతీరావు, వరలక్ష్మి, శ్రీశైలం, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

నిండు కుండలా ఆర్డీఎస్

వడ్డేపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : గత పది రోజులుగా ఆర్డీఎస్ కెనాల్‌లో నిండుకుండలా సాగునీరు ప్రవహిస్తోంది. డ్యాం నుంచి నాలుగువేల క్యూసెక్కుల నీరు వస్తుందని ఏఈ శ్రీనివాసులు శనివారం విలేకరులకు తెలిపారు. ఎత్తిపోతల వద్ద 292 మీటర్ల నీరు ఉందని చెప్పారు. ఐదారు రోజులుగా ఇదే ప్రవాహం కొనసాగుతుందన్నారు. ఎలాంటి ఇబ్బందులు పడకుండా పంట పొలాలకు సాగునీరు కట్టుకోవాలని రైతులకు సూచించారు. ఇదే విధంగా మార్చి మొదటి వారం వరకు సాగునీరు ఇస్తే పంటలు గట్టెక్కుతాయని రైతులు అధికారులను కోరుతున్నారు.



డీ-25 ఆర్డీఎస్‌లో నిండుగా ప్రవహిస్తున్న సాగునీరు

55.85% బీసీలు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన వివరాలతో నివేదికను రూపొందించారు. సమగ్ర కుల సర్వే వివరాల నివేదికను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రివర్గ ఉపసంఘానికి అధికారులు అందజేయనున్నారు. ఆ నివేదికపై ఉపసంఘం అధ్యయనం చేయనుంది. 5న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, బీసీల రిజర్వేషన్లపై ఒక తీర్మానం చేసి.. దాన్ని కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ మేరకు బీసీల రిజర్వేషన్లను పెంచేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు మించకుండా, న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేలా ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. కాగా, మార్చి 20 నాటికి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిశగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ చేపడుతోంది. కుల సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరనుండడంతో ఎన్నికల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

బీసీ కమిషన్.. కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్..



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం, సురేఖ, ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, ఏప్ బలయ్య

తెలంగాణ ఏర్పాటైన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సర్వే చేపట్టింది. దాని ప్రకారం 2014లో బీసీలు 51శాతం, ఓసీలు 21, ఎస్సీలు 18, ఎస్టీలు 10 శాతం ఉన్నట్టు తేలింది. కానీ, ఈ సర్వేను అధికారికంగా విడుదల చేయలేదు. మళ్లీ 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇటీవల సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో కులం, మతం సహా అన్ని వివరాలను సేకరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో ఎంతమేర రిజర్వేషన్లను కల్పించాలనే అంశంపై ప్రభుత్వం ఈ సర్వేను వినియోగించుకోనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం సర్కారు బీసీ కమిషన్‌తో పాటు, ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రత్యేక కమిషన్ కూడా బీసీల రిజర్వేషన్లపై లోతుగా అధ్యయనం చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిసింది. సర్వే వివరాలు, ప్రత్యేక కమిషన్ సూచనలను పరిగణనలోకి తీసుకొని.. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది.

మంత్రులతో సీఎం భేటీ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో భేటీ అయ్యారు. బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడారు. పొన్నం మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులగణనపై శాసనసభలో తీర్మానం చేసి, ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కులగణన కార్యరూపం దాల్చే అంశంపై సీఎం చర్చించారని తెలిపారు. దీంతోపాటు ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ తీసుకున్న నిర్ణయాలపైనా చర్చించామన్నారు. ఈ నెల 5న సబ్ కమిటీ ఇచ్చిన నివేదికను క్యాబినెట్ ముందు పెడుతున్నారని, అదే రోజు శాసన సభలో చర్చించి ప్రజాస్వామ్య యుతంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

వర్గీకరణపై త్వరలో నివేదిక: రాజనర్సింహ

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రెండు గంటల్లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన చేశామని, వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దీనిపై ఇప్పటికే సానుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం వేశారన్నారు. ఉపసంఘం సూచన మేరకు ఏక సభ్య కమిషన్‌ను నియమించామని.. ఈ కమిషన్ త్వరలో నివేదిక ఇవ్వబోతోందని తెలిపారు. దానిపై మంత్రివర్గంలో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు.

న్యూస్ బాక్స్

కొనసాగిన ధాన్యం కొనుగోళ్లు

దేవరకద్ర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ధాన్యం కొనుగోళ్లు కొనసాగాయి. కందులు 33 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.7,039, కనిష్ఠంగా 6,853, పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

డిగ్రీ కళాశాలకు స్థల పరిశీలన

దేవరకద్ర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి తహసీల్దార్ కృష్ణయ్య బల్సుపల్లి గ్రామ శివారులో 90 సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. వివరాలు కలెక్టర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు.

చెరువు ఆక్రమణను అరికట్టాలి

కోయిలకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గార్లపాడ్ కొండేని చెరువు ఆక్రమణను అరికట్టాలని కాంగ్రెస్ గ్రామ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా శనివారం తహసీల్దార్ రాజా గణేష్‌కు వినతిపత్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గండీడ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సల్కర్‌పేట సబ్‌స్టేషన్ మరమ్మతు నిమిత్తం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని ఏఈ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సల్కర్‌పేట, గండీడ్, జంగంరెడ్డిపల్లి, చిన్నపల్లి, రెడ్డిపల్లి, కొండాపూర్, పంచాంగాలతండా, మసురుపల్లిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

గంగాపూర్ జాతరకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని 3, 4, 5వ తేదీల్లో గంగాపురం జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్‌ఎం సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ప్రత్యేక బస్సులు 150 అదనపు ట్రిప్పులు మహబూబ్‌నగర్ నుంచి గంగాపురం జాతరకు నడుపుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

రాజాపూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ప్రతిభ పాఠశాల, సోమ్లతండా ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం సోమ్లతండాకు చెందిన సతీష్ రాథోడ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఎంఈవో సుధాకర్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జయరాములు అన్నారు. శనివారం మండలంలోని తీగలపల్లి, సిద్దోటం, కాకర్లపాడ్ గ్రామాల్లో పర్యటించారు. కార్యదర్శులు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. అంతకుముందు వివిధ పార్టీల నాయకులతో స్థానిక ఎన్నికలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకుడు అంజ య్య, బీఎస్పీ నాయకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాలమూరులో 30 పోలీసు చట్టం అమలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో మార్చి 31 వరకు 30 పోలీసు చట్టం అమలు చేస్తున్నామని, అనుమతులు లేనిదే ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని ఎస్పీ జానకి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజినల్ పోలీస్ అధికారి లేదా ఉన్నత అధికారుల అనుమతి లేకుండా పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదన్నారు. నిషేదిత ఆయుధాలైన కత్తులు, కర్రలు, జెండా కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థములు, నేరమునకు పురిగొలిపే ఎలాంటి ఆయుధాలు నిషేదమని చెప్పారు. లౌడ్ స్పీకర్, డీజేలు అనుమతించబోమని, నియమాలు ఎవరు ఉల్లంఘించిన 30 పోలీసు చట్టం ప్రకారం శిక్షార్హులని పేర్కొన్నారు.

మునిసిపల్ కమిషర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

భూత్పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్ మునిసిపల్ కమిషనర్‌గా నురూల్ నజీబ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టగా, శనివారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పారిశుధ్యం, తాగునీటి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మట్టి ఆనంద్, బోరింగ్ నరసింహ, పరశురాం, ఎల్లప్ప పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

భూత్పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కారును వెనకాల నుంచి వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన శనివారం ఉదయం మండలంలోని పోతులమడుగు గ్రామ శివారులో గల 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బెంగుళూరుకు చెందిన రహీమ్ ఖాన్, అర్పిత్ ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో పోతులమడుగు గ్రామ శివారులో యూటర్న్ వద్ద విద్యుత్ స్తంభంతో వెళ్తున్న ట్రాక్టర్ రోడ్డును క్రాస్ చేస్తుండగా, కారును రోడ్డుపై నిలిపారు. ఆ వెనుకాలే వస్తున్న ఓ ట్రక్కు కారును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి.

ఆరోపణల్లో నిజం లేదు

» దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి



దమగ్నాపూర్‌లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

చిన్నచింతకుంట/ మూసాపేట ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారని, తిరుగుబావుటా ఎగురవేస్తున్నారంటూ వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ఇది కేవలం పింక్ మీడియా, బీఆర్‌ఎస్ నాయకుల ఫేక్ న్యూస్ అంటూ ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని దమగ్నాపూర్‌లో సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలతో పాటు గ్రామంలో వాల్మీకీ ఆలయ నిర్మాణానికి రూ.నాలుగు లక్షల ప్రొసీడింగ్ కాపీని సంఘం నాయకులకు అందజేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు భూమిపూజ చేసి కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేసి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అంబులెన్స్‌ను ప్రారంభించారు. అదే విధంగా మూసాపేట మండలం పొన్నకల్ గ్రామంలో కామన్ క మ్యూనిటీ షెడ్డు నిర్మాణానికి భూమిపూజ, అడ్డాకుల పీహెచ్‌సీలో 108 అంబులేన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులతో ఎమ్మెల్యేలు సఖ్యతగా ఉన్నామన్నారు. దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, సింగిల్ విండో చైర్మన్లు సురేందర్ రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, కురుమూర్తి ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు వట్టెం శివకుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు ఎస్.వెంకటేష్, ఖైమూద్, తహసీల్దార్ ఎల్లయ్య, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పాల్గొనగా, మూసాపేటలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, నాయకులు గంగుల విజయ్ మోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండ జగదీశ్వర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, బి.దశరథరెడ్డి, షఫీ అహ్మద్, హేమవర్ధన్‌రెడ్డి, లింగారెడ్డి, రంజీత్, సలీమ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

తెలంగాణలో విద్యకు మహర్దశ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో విద్యకు మహర్దశ ప్రారంభమైందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరు కస్తూర్బా బాలికల విద్యాలయంలో సొంత నిధులతో ఇంటర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేపిన సైన్స్‌ల్యాబ్, ముడా నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌కు ప్రారంభించి, మాట్లాడారు. కేజీబీవీ కళాశాలలో తల్లిదండ్రులు లేని 11 మంది విద్యార్థులను కాంగ్రెస్ మండల నాయకులు సలహాదారులుగా వారి సంరక్షణకు ఈ సంవత్సరం కాలంపాటు చూసుకుంటారని, ఇది బాధ్యతగా భావించాలన్నారు. 11 మంది విద్యార్థుల్లో నేను కూడా ఒక విద్యార్థి సంరక్షణ బాధ్యత తీసుకుంటున్నానన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ఎంఈవో కృష్ణయ్య, ప్రిన్సిపాల్ సువర్ణ, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు.

విద్యానిధికి స్పందన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : మహబూబ్‌నగర్ విద్యా నిధికి మంచి స్పందన వస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ విద్యానిధి చెక్కులను దాతలతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. జనవరి నెలలో విద్యా నిధికి సుమారు రూ.8.50 లక్షలు అందజేయడం జరిగిందని. ఈ రోజు రూ.3.37 లక్షలు విలువ గల చెక్కులు అందజేసినట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు విశాఖ పట్టణంలో జరుగనున్న అంతర్జాతీయ ఓపెన్ కరాటే పోటీలకు జిల్లా విద్యార్థులు వెళ్తున్నారని వారి ఖర్చుల నిమిత్తం రూ.25 వేల అందిస్తున్నామన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, విద్యానిధి దాతలు మోహన్‌రెడ్డి, రషీద్‌ఖాన్, అంజనేయులు, రాఘవేందర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పాలమూరు : విద్యుత్ 1104 యూనియన్ 2025 క్యాలెండర్, డైరీతో పాటు పాటు సీఐటీయూ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శనివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మాలలకు కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు.

అంకితభావంతో పని చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కొనపాలమూరు పాఠశాలలో విద్యా నిధి నిధుల ద్వారా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, టీవీలను ప్రారంభించారు.

వాటర్ సప్లై, శానిటేషన్‌పై సమీక్ష

జడ్చర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో వాటర్ సప్లై, ఎలక్ట్రిషన్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్‌తో పాటు వివిధ శాఖల పనితీరుపై శనివారం మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని వార్డుల్లో వాటర్ సప్లై అంశంలో అ వాంతరాలు ఉండకూడదన్నారు. శానిటేషన్ పనులు సజావుగా సాగాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మార్చి 31వ తేదీలోగా ఇంటి బిల్లులు, నల్ల బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలని ఆదే శించారు. అదే విధంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ను సైతం మార్చి 31లోగా పూర్తి చేయాలని తెలిపారు. మునిసిపాలిటీలోని 13వ, 24వ, 26వ వార్డుల్లో శానిటేషన్‌ను ప్రైవేట్ ఏజెన్సీకి పైలట్ ప్రాజెక్ట్ కింద అప్పచెప్పిన విషయాన్ని చర్చించారు. సమావేశంలో కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్, బుక్క మహేష్, కుమ్మరి రాజు, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం


ధ్వజారోహణం సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు

జడ్చర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురం లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు అగ్నిప్రతిష్ట కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. ధ్వజప తాక ఊరేగింపు, ధ్వజాధివాసము, ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ధ్వజారోహణం చేపట్టారు. రాత్రి హనుమత్ వాహన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి ఫొటోలతో దాత మద్ది రాంరెడ్డి ముద్రించిన క్యాలెండర్‌ను ఆలయ ఈవో దీప్తిరెడ్డి ప్రారంభిం చారు. ఆలయ ట్రస్టీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, విశ్వం, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మిడ్జిల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రెయింబో వెంచర్‌కు సంబంధించిన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ప్లాట్లు కొన్న వారికి న్యాయం చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశామని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్, యువమోర్చా మండల అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు జంగయ్య, నారాయణ, శివశంకర్, చంద్రశేఖర్, యాదయ్య, చంటి, వెంకటే ష్, నవీన్, అరవింద్, సతీష్‌గౌడ్, రవింద్ర ఉన్నారు.

ప్రజా సంక్షేమానికి ఎమ్మెల్యే కృషి

కోయిలకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల నాయకులు రవీందర్, విద్యాసాగర్‌గౌడ్ తెలిపారు. శనివారం మండలంలోని కుస్మహ్మద్‌పల్లిలో రూ.ఆరు లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును పరిశీలించారు.

ఒత్తిడి లేకుండా చదవాలి

కోయిలకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఒత్తిడి లేని విద్యను జయించినప్పుడే విజయం సాధిస్తారని సైకాలజిస్ట్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థినిని అభినందించిన కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సౌత్ ఇండియా సైన్స్‌ఫేయిర్ - 2025లో స్పెషల్ ప్రైజ్ పొందిన కె.వరుణ్ చక్రవర్తిని శనివారం కలెక్టర్ విజయేందిర బోయి శాలువాతో సన్మానించి అభినందించారు. ఎంపీహెచ్‌ఎస్ చిన్నరేవల్లి, బాలనగర్ మండలానికి చెందిర విద్యార్థి జనవరిలో పాండిచ్చేరిలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫేయిర్‌లో స్పెషల్ ప్రైజ్ సాధించాడు.

బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన విద్యార్థులు

జడ్చర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను శనివారం కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్‌లోని కర్ణాటక విశ్వవిద్యాలయం వృక్షశాస్త్రం విద్యార్థులు సందర్శించారు. ఎంఎస్‌సీ చదువుతున్న 51 మంది విద్యార్థులకు మొక్కలు, వివరాలు, క్యూఆర్ కోడ్‌తో వివరాలు తెలిపే విధంగా ఏర్పాటు చేసిన తీరును బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య వివరించారు. ప్రొఫెసర్ తంగాదురై పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలువురు పల రకాలుగా స్పందించారు. కొందరు మధ్య తరగతి ప్రజలకు, ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉందనగా, మరికొందరు జిల్లాకు మొండి చూపారని అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌పై ఎవరు ఏమన్నారంటే..

- మహబూబ్‌నగర్ విద్యావిభాగం/పాలమూరు, ఆంధ్రజ్యోతి

ఢిల్లీ, బిహార్ ఎన్నికల బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఢిల్లీ, బిహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టినట్లు ఉంది. ఉద్యోగులకు 25 నుంచి 30శాతం ట్యాక్స్ విధించటం సరికాదు. విద్యకు ప్రాధాన్యం ఇవ్వలేదు. గ్రామీణ ఉపాధి ప్రస్తావనే లేదు. తెలంగాణలో ఆర్‌ఆర్‌ఆర్ విషయం, మెట్రో గుర్తించలేదు.

- తిమ్మప్ప, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్

ప్రజల కొనుగోలు శక్తి దిగజారే బడ్జెట్



ప్రజలు కొనుగోలు శక్తి పెంచేలా ఉండాల్సిన బడ్జెట్, దిగజారే విధంగా ఉంది. కార్మికులు, ఉద్యోగులు, పేదలకు ఉపయోగం లేని బడ్జెట్. పెట్టుబడిదారులకు అనుకూలమైన బడ్జెట్. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా ప్రయోజనం లేక అసమర్థత కనిపిస్తోంది.

సి.వెంకటేష్, టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

కార్పొరేట్‌లకు అనుకూలమైన బడ్జెట్



కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్‌కు సీపీఐ వ్యతిరేకం. అంకెల గారడితప్ప ప్రజలకు ఒరిగేదేమిలేదు. నిత్యావసరమైన సరుకుల ధరలపై ఎక్కడా మాట్లాడలేదు. పాలమూరు-రంగారెడ్డికి మరోసారి అన్యాయం.

- బి.బాలకిషన్, సీపీఐ జిల్లా కార్యదర్శి

కార్పొరేట్‌ల అనుకూల బడ్జెట్



బడ్జెట్ పేదలకు వ్యతిరేకమైనది. స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్. వ్యవసాయం, అనుబంధ రంగాలకు తక్కువ కేటాయించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంకు 1.7 శాతం నిధులు కేటాయించి కేంద్రం తన వ్యతిరేకత చాటుకుంది. రక్షణకు 14.3, వ్యవసాయానికి 8.7, విద్య, వైద్యం 3.1, సామాజిక రంగం 1.2, వడ్డీ చెల్లింపులకు 20శాతం కేటాయింపులు ఏమిటి. ద్రవ్యలోటు అందులో 4.8 శాతం చూపారు.

- ఏ.రాములు,సీపీఎం జిల్లా కార్యదర్శి

మధ్యతరగతి వేతన జీవులకు వరం



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్య తరగతి వేతన జీవులకు వరం లాంటిది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12 లక్షల వార్షిక బడ్జెట్ ఉన్నవారు కూడా ఆదాయపన్ను నుంచి పూర్తి దిబేట్ ప్రకటించడం ఆనందించాల్సిన విషయం. స్టాండర్డ్ డిడక్షన్‌ను కలుపుకొని మరో రూ.75,000 కూడి మినహాయింపు ఇచ్చారు.

- బొల్లం సునీల్‌కుమార్, తపస్ జిల్లా అధ్యక్షుడు

కారులో చెలరేగిన మంటలు


కారులో మంటలను ఆర్పుతున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది

జడ్చర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మ సబ్‌స్టేషన్ ముందు ఓ కారులో మంటలు చెలరేగాయి. స్థానికులు, ఫైర్ ఇంజన్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఆం ధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ పట్టణానికి చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి జడ్చర్లలో నివాసం ఉంటూ, పోలేపల్లి సెజ్‌లోని ఓ పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్నాడు. తన కారును స్నేహితుడికి శనివారం అద్దెకు ఇచ్చాడు. అతడు కారులో వెళ్తూ జడ్చ ర్ల, మహబూబ్‌నగర్ మధ్యనున్న మయూరీ పార్కు వద్ద ఓ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఆ వాహనంలోని వ్యక్తి గాయపడ్డాడు. అతడిని మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం ఆ స్నేహి తుడు కారును వేగంగా నడుపుకుంటూ హైద రాబాద్ వైపు వెళ్తుండగా, సబ్‌స్టేషన్ వద్ద వా హనం బ్యానెట్ నుంచి పొగలు వచ్చి, మంటలు చెలరేగాయి. దీంతో అతడు కారు దిగి పారిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్ని మాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేశారు.

సోనియా గాంధీ దిష్టిబొమ్మ దహనం


సోనియాగాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ గిరిజన మోర్చా నాయకులు

జడ్చర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో జడ్చర్ల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శనివారం సోనియాగాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్రపతి ముర్మును ఓల్డ్ పూర్ లేడీ అని సంబోధించి అవమానపరిచారని, వెంటనే సోనియా గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంటీ బాలకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బాలవర్దన్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజేష్, నవీన్, రమేశ్‌జీ, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, నరేష్‌నాయక్, నరేశ్ ఉన్నారు.

విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టాలి : డీఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో పరీక్షలంటే ఉన్న భయాన్ని పోగొట్టి, పరీక్షలకు సిద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల సమావేశ మందిరంలో రెండురోజుల పాటు ఉపాధ్యాయులకు నిర్వహించిన కెరియర్ గైడెన్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు ఉండే పిల్లలకు ఎలా చదువుకోవాలి, ఏ కోర్సులు చదవాలనే విషయాలు వివరించాలన్నారు. డైట్ ప్రిన్సిపాల్ మొరజుల్లాఖాన్, ఏఎంవో దుకుండు శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పీడీఎస్‌యూ జనరల్ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యవక్త ఆయన పాల్గొని, మాట్లాడారు. కొఠరి కమిషన్ ప్రకారం 10 శాతం నిధులు విద్యకు కేటాయించాలని ఉన్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం, నాయకులు వెంకటేష్, శ్రీకాంత్, రాకేష్, వినయ్, చంద్రశేఖర్, వెంకటటేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

భూత్పూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని న్యూ ఎర పాఠశాలలో రెండు రోజులుగా విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకుం టున్నాయి. ముఖ్యంగా బాల్య వివాహల నిర్మూలన, వర్షపు నీటితో భూగర్భ జలాలను ఎలా కాపాడుకోవాలి? రైతులు కోతుల బెడద నుంచి పం టలను ఎలా ఉపసమనం పొందాలి అనే విషయాలను విద్యార్థులు చక్కగా ప్రదర్శించి, వివరించారు. దాదాపు 90కి పైగా వివిధ ప్రదర్శనలను విద్యార్థులు ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు అన్నదమ్ములు గొడవ పడగా, మనస్తాపంతో తమ్ముడు పొలం వద్ద పురుగుల మందు తాగి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ విక్రం కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన నాగేష్(36) తన అన్న చెన్నాజీతో కలిసి ఉంటూ గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు. గతనెల 30న పొలం వద్ద వేరుశనగ పంట విషయంలో ఇద్దరు గొడవపడగా, నగేష్ పొలం వద్ద ఉండిపోయాడు. రాత్రి భార్య లక్ష్మీకి ఫోన్ చేసి తాను పురుగుమందు తాగినట్లు తెలిపారు. స్పందించిన వారు జిల్లా ఆసుపత్రికి తరలించారు. శనివారం మృతి చెందాడు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

● హన్వాడ : మండలంలోని పల్లెమోనికాలనీకి చెందిన చెన్నయ్య (56) హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. గత నెల 28న వ్యవసాయ పొలంలో అనారోగ్యంతో పురుగుల మందు తాగగా, హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా, కొడుకు విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పార్టీ విస్తరణే లక్ష్యంగా పని చేయాలి


నామినేషన్ పత్రాలను స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి దుద్యాల ప్రదీప్‌కుమార్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, పార్టీ విస్తరణే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నికల అధికారి దుద్యాల ప్రదీప్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుల ఎంపికకు సంబంధించి సహాయ ఎన్నికల అధికారి శేరి పాండురంగారెడ్డితో నామినేషన్ పత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని, ఇందుకు క్షేత్రస్థాయిలో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పథకాల అమలు చేయడంతో పూర్తిగా విఫమైందన్నారు. నాలుగు హామీల అమలుకు రాష్ట్రంలో 12,900 గ్రామాలు ఉండగా, మండలానికి ఒక గ్రామం చొప్పున 561 గ్రామాలను ఎంపిక చే యడం ఏంటని ప్రశ్నించారు. బడ్జెట్‌లో ఇందిర మ్మ ఇళ్లకు ఏడు వేల కోట్లు కేటాయించినప్పటి కీ ఇప్పటి వరకు ఒక్క రూపాయ కూడా ఖర్చు చేయలేదన్నారు.